క్లుప్తంగా

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని వారి సంక్షేమం కోసం కృషి చేయాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు పేర్కొన్నారు. తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఘంటసాల కళా వేదికపై గురువారం సినీ సంగీత విభావరి, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులకు ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, మహిళా జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, మామ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మహంతి వాసుదేవరావులను నిర్వాహకులు సత్కరించారు. గాయకులు సినీ గీతాలను ఆలపించారు. ధనాశి ఉషారాణి, యూవీ రత్నం, చిట్టిబాబు, జోషి పాల్గొన్నారు.

25 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 25 మందికి కోర్టు జరిమానా విధించింది. నగరంలోని 2, 4వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 25 మందిని గుర్తించారు. వారిని ఆరో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశ పెట్టగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు వారిలో నలుగురికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 21 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రమాదాల నివారణలో భాగంగా నగరంలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

నారాయణ మంత్రం సర్వపాప హరం



విజయవాడ కల్చరల్: నారాయణ మంత్రం సర్వపాపహరమని త్రిదండి అష్టాక్షరీ స్వామి అనుగ్రహ భాషణ చేశారు. వేదా చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం శ్రీపాద శ్రీవల్లభ జాతక గురు వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్రత కార్యక్రమాన్ని ప్రారంభించిన స్వామి మాట్లాడుతూ నారాయణుడు సర్వ శుభకరుడన్నారు. వ్రతం ఆచరించడం వల్ల సర్వశుభాలు కలుగుతాయన్నారు. వేముల హజరత్తయ్య గుప్తా, వేదా ఛారిటబుల్ సంస్థ నిర్వాహకులు యడ్లపాటి శిరీషా రాణి, శేష సాయి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి ఆషాఢ సారె

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా అన్నపూర్ణాదేవి అమ్మవారికి దేవస్థానం వారు ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీఅన్నపూర్ణాదేవి అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానంలో వేద పండితులు మహా విద్య విశేష హోమం నిర్వహించారు. సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈఓ సీతారామయ్య, ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

రూ.7.06 లక్షలు అపరాధ రుసుం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు సంయుక్తంగా జిల్లా పర్యవేక్షణాధికారి టి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో గాంధీనగర్ సెక్షన్‌లో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో 45 మంది అధికారులు, 110 మంది సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి 3,812 సర్వీసులను తనిఖీ చేశారు. అనుమతి ఇచ్చిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 228 మందికి రూ.7,06,000లు అపరాధ రుసుం విధించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (విజిలెన్స్) పి. విజయకుమారి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. రవీంద్ర బాబు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యంపై 83310 20537, 83310 14951 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. తనిఖీల్లో డీఈఈ నాగేశ్వరరావు, బసవరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆపాత మధుర గీతాలు

విజయవాడ కల్చరల్: గాయకులు నిరంతరం సాధన చేయాలని కళాపోషకుడు మీరాకుమార్ అన్నారు. రాగలహరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో గురువారం ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. మీరాకుమార్ మాట్లాడుతూ గానం రాగ భావ యుక్తంగా ఉండాలన్నారు. సాంస్కృతిక సంస్థలు గాయకులను ప్రోత్సహించాలని సూచించారు. సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మనందరావు, ప్రసూనా రామన్, చింతకాయల చిట్టిబాబు, న్యాయవాది ముష్టి శ్రీనివాస్ ప్రసంగించారు.

నత్తనడకన రోడ్డు పనులు

- రోడ్డు మధ్యలో కంకర కుప్పలు
- రాకపోకలకు ఇబ్బందులు



రోడ్డు మధ్యలో పోసిన కంకర కుప్పలు



గ్రావెల్ పోసి సరిచేయకుండా వదిలివేసిన రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు పనులు వాహన చోదకులు, పాదచారుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఇక్కడ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల అధికారులు రహదారి పనులు ప్రారంభించారు. అయితే ఇక్కడ రోడ్డు పనులు ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనుకకు చందనా జరుగుతున్నాయి. రోడ్డు పనులు ప్రారంభించి పదిహేను రోజులు అవుతున్నా ఇంత వరకు పనులు ముందుకు సాగడం లేదు. తూతూమంత్రంగా కేవలం గ్రావెల్ పోసి వదిలేశారు. కనీసం నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించకుండా.. రోలింగ్ అయిన చేయకుండా వదలివేయడంతో ఎగుడుదిగుడు, రాళ్లు తేలిన రోడ్డుపైనే స్థానికులు ఇబ్బంది పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

రోడ్డుపై కుప్పలు

ఇక్కడ రోడ్డు పనుల్లో భాగంగా నాలుగు రోజుల క్రితం రోడ్డుపై కంకర పోశారు. అయితే కంకరను రోడ్డు మధ్యలో కనీసం రాకపోకలు సాగించేందుకు కూడా వీలులేకుండా వేశారు. నాలుగు రోజులు దాటినా ఇంత వరకు కంకరను సరిచేయడం కానీ, రోడ్డు పనులు చేయడం కానీ చేయలేదు. దీంతో ఈ సమీప ప్రాంతంలో నివసిస్తున్న స్థానికులు.. చిన్న చిన్న ఖర్కానాల యజమానులు సరుకులు తెచ్చుకునేందుకు మార్గం లేక అవస్థలు పడుతున్నారు. రోడ్డు సరిచేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్రవాహనం కూడా వెళ్లదు



మేం ఇక్కడ సమీపంలోనే నివసిస్తున్నాం. ఇక్కడ నాలుగు రోజులుగా కనీసం ద్విచక్రవాహనం వెళ్లేందుకు కూడా వీలులేకుండా రోడ్డుకు అడ్డంగా కంకర పోసి వదిలివేశారు. రాత్రిపూట చీకటిలో ఇంటికి వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నాం. అలాగే పిల్లలను పాఠశాలలకు తీసుకువెళ్లడం ఒక సవాల్‌గా ఉంది.

–సురేష్, దావు బుచ్చయ్యకాలనీ

విచక్షణ లేకుండా పనులు



ఇంటి నుంచి బయటకు ఎలా వెళతారు అనే విచక్షణ లేకుండా రోడ్డుకు అడ్డంగా కంకర పోశారు. ఇక్కడ ఖార్కానాలో పనిచేస్తున్న వారు రావడానికి సైతం నానాయాతన పడుతున్నారు. పిల్లలు స్కూళ్లకు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉంది. ఇక్కడ రోడ్డు రాకపోకలకు అనువుగా లేకపోవడం వల్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

–కె. వెంకటరెడ్డి, దావు బుచ్చయ్యకాలనీ

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

కిటకిటలాడిన బాబా మందిరాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆధ్వర్యాన గురుపౌర్ణమి ఉత్సవాలు జరిగాయి. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. మందిర కమిటీ ఆధ్వర్యాన ఆంధ్ర సంస్కృత ఉభయ భాష పండితులు కళాశాల ఉపన్యాసకులు బ్రహ్మశ్రీ జేఎస్ఆర్ శర్మను సత్కరించారు. కార్యక్రమాలను మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కార్యదర్శి కుంచనపల్లి రవి శంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు. పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహన రావు ఆధ్వర్యాన 21 దివ్య ద్రవ్యములతో బాబావారికి అభిషేకం నిర్వహించారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో...

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన గురుపౌర్ణమి మహోత్సవాలు జరిగాయి. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. శ్రీకల్యాణ షిర్డీసాయిబాబా మందిరంలో బాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అలాగే శ్రీశివకేశవ ఆలయం, మధురానగర్ శ్రీభగవాన్ షిర్డీసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గురువులను సత్కరించారు.

స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట కేఎల్‌రావు భవన్‌లో స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యాన గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పైడిపాటి ఉమానాథ్ శర్మ మాట్లాడుతూ భారతీయ గురుపరంపరలో శ్రీ గురు విశ్వస్ఫూర్తి వారిది విశిష్ట స్థానమని కొనియాడారు. సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కందుకూరి దీప్తి ప్రసన్న, స్ఫూర్తి కుటుంబం ఆదర్ మేక రజనీకాంత్, విజయవాడ జోనల్ ఇన్‌చార్జి రత్న కిషోర్ బాబు పాల్గొన్నారు. అలాగే లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి, కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, కోటి, చింతా దుర్గారావు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్ కండ్రికలోని షిర్డీ సాయిబాబా మందిరంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు యరగొర్ల శ్రీరాములు, పందిరి వాసు పాల్గొన్నారు. అలాగే గురుపౌర్ణమి సందర్భంగా కండ్రికలోని షిర్డీ సాయిబాబా మందిరంలో సాయి మణికంఠ భక్త బృందం ఆధ్వర్యంలో కాపు సంఘం నాయకులు పందిరి వాసు, అంజిబాబు గురుస్వాములను సత్కరించారు. పాలపర్తి మోహనరావు, ముప్పత్తి చంద్రశేఖర్, భాస్కర్ రావు, వైకుంఠరావు పాల్గొన్నారు.



కండ్రికలో సాయిబాబాకు హారతి ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ముత్యాలంపాడు బాబా మందిరంలో డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు



శ్రీకల్యాణ షిర్డీసాయిబాబా మందిరంలో అన్నదానం

బీజేపీలో గురుపౌర్ణమి



బీజేపీ ఆధ్వర్యంలో సీనియర్ సభ్యులకు సత్కారం

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగంగా విజయవాడ రెండవ అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏకే భాషా చేతుల మీదుగా విజయవాడ న్యాయవాది గుమస్తాల అసోసియేషన్ హాల్‌లో సీనియర్ సభ్యులు సుబ్బారావు, ఎడ్ల వెంకటేశ్వరరావు, టీఎస్‌కే శర్మ, ఏపీ రాష్ట్ర న్యాయవాది గుమస్తాల వెల్ఫేర్ కమిటీ మెంబర్ నాళం బాలకృష్ణలను సన్మానించారు. విజయవాడ లాయర్ గుమస్తాల అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ మూర్తి, సెక్రటరీ శ్రీనివాస్, సంఘ సభ్యులు రమేష్, సాయి, వెంకటేశ్వరరావు, మహేష్, ధనేశ్వరరావు, న్యాయవాదులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్



ఎస్ఆర్ఆర్‌లో తల్లులకు వందనం చేస్తున్న విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణకాంత్ అధ్యక్షతన జరిగింది. అయితే ఈ సమావేశానికి పేరెంట్స్ అంతంత మాత్రంగానే హాజరయ్యారు. విద్యార్థులతో తల్లిదండ్రులకు వందనం చేయించారు. స్థానిక కార్పొరేటర్, మాచవరం పోలీసులు పాల్గొన్నారు. ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, పాఠశాల హెచ్ఎం నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్‌లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో జరిగింది. 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్, ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్, వాంబేకాలనీ జంధ్యాల దక్షిణామూర్తి హైస్కూల్, న్యూఆర్ఆర్‌పేట దేవినేని వెంకటరమణ మున్సిపల్ హైస్కూల్స్‌లో పేరెంట్స్ మీటింగ్స్ జరిగాయి. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఎండీ షాహీనా సుల్తానా, కంచి దుర్గ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టడంతో వృద్ధుడు గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రామవరప్పాడుకు చెందిన యక్కల నరసింహారావు(65) ఈనెల 2వ తేదీన పడవలరేవు జంక్షన్ నుంచి రామవరప్పాడు వెళుతున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన నరసింహారావును చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న నరసింహారావు గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం

పేరెంట్స్ మీటింగ్‌లో విద్యార్థుల తల్లుల ఆవేదన

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యత లోపం కారణంగా విద్యార్థులకు కడుపు నొప్పి వస్తోందని విద్యార్థుల తల్లులు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో మెగా పేరేంట్స్, ఉపాధ్యాయుల 2.0 సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం అన్ని సదుపాయలను సర్కారు పాఠశాలల్లో కల్పిస్తుందని చెప్పిన వెంటనే విద్యార్థుల తల్లులు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం విశేషం. స్కూల్లో పెట్టే భోజనం బాగుండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ఆడపిల్లల టాయిలెట్స్‌కు డోర్స్ లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ సమస్యలను ఎమ్మెల్యేకి చెబుతున్న సమయంలో పేరెంట్స్‌ను ఉపాధ్యాయులు వారిస్తుండగా, తల్లులు పేరెంట్స్ కమిటీ మీటింగ్‌కు ఆహ్వానించారు సమస్యలను చెప్పాలి కదా అని ప్రశ్నించారు. నున్న పోలీసు స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్ కలుగచేసుకొని తల్లులకు, ఉపాధ్యాయులను శాంతింపజేశారు. స్థానిక కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని సత్యనారాయణపురం నాడార్స్ ఫంక్షన్ హాల్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించే బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో- 2.0 గురువారం ప్రారంభమైంది. ప్రముఖ వైద్యుడు డాక్టర్ గంటి ఈశ్వర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, పారిశ్రామిక వేత్తలు తాము తయారు చేసిన ఉత్పత్తులను వినియోగదారులకు చేరువ చేసేందుకు ఇటువంటి ఎక్స్‌పోలను వేదికగా చేసుకోవాలని సూచించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కుందా శ్రీధర్, కొప్పవరపు బలరామకృష్ణమూర్తి, పారిశ్రామిక వేత్త శ్రీనివాస్, డాక్టర్ గురునాథ శర్మ, మల్లిక్, వ్యాపారవేత్త రాజకుమార్, సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

పాయకాపురం(విజయవాడరూరల్): గంజాయి కలిగి ఉన్న వ్యక్తిపై నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గురువారం మీనాక్షి నగర్ కట్టపై గస్తీ తిరుగుతున్న ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావుకు వచ్చిన సమాచారం మేరకు కెల్లా సాయికిరణ్ పాత రాజీవ్‌నగర్‌లో అదుపులోకి తీసుకొన్నారు. అతని నుంచి అమ్మడానికి సిద్ధంగా ఉన్న ఒక కేజీ 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ప్రపంచ జనాభా దినోత్సవంపై సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ జనాభా దినోత్సవం – 2025 'యువత సాధికారత, భవిష్యత్తు రూపకల్పన – ప్రపంచ జనాభా దృక్పథాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, చరిత్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజంటేషన్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసు శాఖ వారు బహుమతి ప్రదానం చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి జాన్ సుకుమార్, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్, ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో స్వయంభూ శ్రీబాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యులు బోయిన గోపాలకృష్ణ మూర్తి, శ్యామల, హరికృష్ణ, సునీత దంపతుల ఆధ్వర్యంలో ఆషాఢ మాస పూర్ణిమ సందర్భంగా అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరంగావఝల ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర అభివృద్ధి కమిటీ సభ్యులు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

శాకంబరీ దేవిగా శ్రీఅన్నపూర్ణాదేవి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆషాఢ పౌర్ణమి సందర్భంగా స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామివారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలను గురువారం నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీఅన్నపూర్ణాదేవిని వివిధ రకాల కూరగాయాలు, పండ్లతో శాకంబరీ దేవిగా అలంకరించారు. వేదపడింతుల సమక్షంలో అమ్మవారికి సహస్ర నామార్చన, చండీ హోమం నిర్వహించారు. ఆలయ సిబ్బంది భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ గంగాధరరావు పర్యవేక్షించారు.



శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో శాకంబరీ దేవిగా శ్రీఅన్నపూర్ణాదేవి

సంప్రదాయ నృత్య పరిరక్షణలో గురువులు కీలకం



నాట్యాచార్యుడు డాక్టర్ అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న శిష్యప్రశిష్యులు

విజయవాడ కల్చరల్: సంప్రదాయ నృత్య పరిరక్షణలో గురువులు భాగస్వాములు కావాలని సంగీత కళాశాల ప్రిన్సిపల్ కందుల లక్ష్మీనరసమ్మ అన్నారు. హంసధ్వని నృత్యాలయ ఆధ్వర్యంలో గురుప్రభ కార్యక్రమంలో భాగంగా జీవీఆర్ సంగీత కళాశాలలో గురువారం నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్‌కు సత్కారం, సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ కూచిపూడి నాట్యం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భాషా సాంస్కృతిక శాఖ మేనేజర్ శ్రీనివాస్ అజయ్ నృత్య సేవలను వివరించారు. నాట్యాచార్యులు పద్మశ్రీ హేమంత్, ఉషా మాధవి పాల్గొన్నారు. నాట్యాచార్యుడు డాక్టర్ అజయ్‌కుమార్ శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో నాట్య గురువు శిష్యులు ప్రదర్శించిన అంశాలు నేత్ర పర్వంగా సాగాయి. వాసుదేవరావు, నిహారిక, సుష్మ, దివ్య, విఘ్నేష్, తానియా ప్రణతిలు నిర్వహించారు. 200మంది చిన్నారులు 15 మంది నాట్యాచార్యులు పాల్గొన్నారు. నాట్యాచార్యుడు అజయ్‌కుమార్‌ను నిర్వాహకులు సత్కరించారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన గురుచరిత్ర



నాటక రచయితను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీదేవి కళాకారుల నాట్యమండలి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం ప్రదర్శించిన గురుచరిత్ర పద్యనాటక వైభవాన్ని చాటింది. షిర్డీ సాయిబాబా కథను పద్యనాటకంగా ఉప్పలూరి లక్ష్మీనారాయణ మలచగా నిమ్మగడ్డ ఏసుపాదం దర్శకత్వంలో చింతలపూడి నాగేశ్వరరావు పర్యవేక్షణలో నాటకాన్ని ప్రదర్శించారు. ఏపీ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెలవెల సత్యనారాయణ గురువు ప్రాధాన్యతను వివరించారు. నాటక రంగానికి చెందిన పీవీఎస్ కృష్ణ, నిభానుపూడి సుబ్బరాజు, పి. వీరాంజినేయులు, కె. జగన్మోహనరావు, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఉప్పాల రాజేశ్వరరావు, గణేష్ కుమార్, నాటక రచయిత లక్ష్మీనారాయణను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో దుర్వాసన రాకుండా చర్యలు



సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన రామలింగేశ్వరనగర్ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను గురువారం పరిశీలించారు. సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో దుర్వాసన రాకుండా ఏర్పాటు చేయనున్న ఓడర్ కంట్రోల్ యూనిట్‌లను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వస్తున్న దుర్వాసన శాతం, ఓడర్ కంట్రోల్ యూనిట్ ఏర్పాటు చేసిన తర్వాత దుర్వాసన ఎంత శాతం తగ్గుతుందనే విషయంపై ఆరా తీశారు. దీనిపై తనకు సమగ్ర నివేదిక ఇవ్వాలని, వాటిని ఏర్పాటు చేసిన తర్వాత తానే స్వయంగా వచ్చి పరీక్షిస్తానని తెలిపారు. నగర పరిధిలోని అన్ని ప్లాంట్లలో ఓడర్ కంట్రోల్ యూనిట్లు ఏర్పాటు చేసి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి యూనిట్ దగ్గర సైనేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. యూనిడో ప్రాజెక్ట్ ద్వారా ఎస్టీపీలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి తమకు నివేదికను సమర్పించాలన్నారు. చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జున్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ కె.షమ్మీ, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యానారాయణ, పి.సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ పాల్గొన్నారు.